# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శుక్రవారం 11-10-2024   సంపుటి : 06   సంచిక : 15   పేజీలు : 8   వెల : రూ 3-00


### ఈనెల 14న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో సర్వసభ్య సమావేశం...

విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. 14 వ తేది సోమవారం సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి దేవాలయంనందు అన్నదానకవిౕటీ,ఆలయకమిటీ గురించి, దేవాలయఅభివృద్ధికొరకు సమావేశం ఏర్పాటు చేయడమైనది తప్పకుండాగురు స్వాములు స్వాములు అందరూ తప్పకుండా రావాల్సిందిగా ఆలయ కమిటీ వారు కోరారు.






# రతన్ టాటా మృతి పట్ల ఏపీ కేబినెట్ సంతాపం..



అమరావతి : దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ చైర్మన్ రతన్ టాటా మరణం పట్ల ఏపీ కేబినేట్ సంతాపం వ్యక్తం చేసింది. గురువారం విజయవాడలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి వర్గ సహచరులు హాజరయ్యారు.కేబినెట్ భేటీకి ముందు రతన్ టాటా చిత్రపటానికి సీఎం, మంత్రులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించి, గౌరవసూచకంగా ఇతర అంశాలేవీ చర్చించకూడదని మంత్రివర్గం నిర్ణయించింది. అజెండా అంశాలపై చర్చను వాయిదా వేసింది. సీఎం చంద్రబాబు, తనయుడు, మంత్రి లోకేష్ ఇద్దరు కలిసి ముంబాయికి వెళ్లి రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించనున్నారు.

# అశ్రునయనాల మధ్య రతన్ టాటా అంత్యక్రియలు



**మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహణ**
**అమిత్ షా, సిఎం షిండే, పారిశ్రామిక దిగ్గజాల నివాళి**





ముంబై,అక్టోబర్10(ఆర్ఎన్ఎ):పారిశ్రామిక దిగ్గజం,టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, సిఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవీస్, శక్తికాంద్ దాస్, అంబానీ దంపతులు, ఇతర ప్రముఖులు నివాళి అర్పించారు. హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశిరచిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు.

# కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నాశనం : వైఎస్ జగన్



అమరావతి : ఏపీలో గడిచిన నాలుగు నెలలకాలంలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. విద్యా, వైద్యరంగాలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. రేపల్లె నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధాలతో పోటీ వడలేకపోయామని అన్నారుఅబద్ధాలు చెప్పినా ఈరోజు ప్రజల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఇప్పటికే లక్షన్నర పెన్షన్లు కట్ చేశారని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ పాలన తీసుకొచ్చి ప్రజలను భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజానీకం చంద్రబాబు మోసాలను గమనించి తిరుగబడుతున్నారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీకి సింగిల్ డిజిట్ కూడా ఇవ్వరని జోస్యం చెప్పారు.వైసీపీ హయాంలో లంచాలు లేకుండా పథకాలను అందించామని పేర్కొన్నారు. కష్టాలు ఎప్పుడూ శాశ్వతంగా ఉండవని అన్నారు. విలువలు, విశ్వసనీయతే శ్రీరామరక్ష అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైసీపీకి దక్కుతుందని అన్నారు.

# రెండు రోజుల పర్యటనకోసం లావోస్ చేరుకున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ఆసియాన్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ లావోస్ పర్యటనకు వచ్చారు. లావోస్‌లో జరగనున్న 21వ ఆసియాన్ ఇండియా, 19వ తూర్పు ఆసియా సదస్సులలో ప్రధాని మోదీ పాల్గొంటారు. లావోస్ పర్యటన ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని తన పర్యటన సందర్భంగా మోదీ అన్నారు. లావోస్ చేరుకున్న ప్రధాని మోదీకి స్థానిక డబుల్ ట్రీ హోటల్‌లో ప్రవాసభారతీయులు ఘనస్వాగతం పలికారు. ప్రవాస భారతీయులను ముఖ్యంగా చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ప్రధాని వారికి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. స్థానిక ప్రవాస భారతీయులు ప్రధాని నరేంద్ర మోదీకి జాతీయజెండాలు, కళాకృతులు అందజేశారు. అనంతరం స్థానిక యువకులతో కలిసి ప్రధాని మోదీ గాయత్రీ మంత్రం సహా వివిధ శ్లోకాలను పఠించారు. బౌద్ధ భిక్షువులతో కలిసి ప్రధాని మోదీ ప్రార్థనలు చేశారు. స్థానిక కళాకారిణుల సంప్రదాయ నృత్యాలను వీక్షించిన ప్రధాని వారిని అభినందించారు. లావోస్ సంస్కృతి, వారసత్వ కట్టడాలు, ప్రాచీన కళల వివరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌నుప్రధాని తిలకించారు. పీపుల్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ లావోస్ ప్రధాని ఆహ్వానం మేరకు రెండు రోజుల లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ వచ్చారు. సాంస్కృతిక ప్రదేశాల పునరుద్ధరణ, విద్యుత్ ప్రాజెక్టులతో పాటు, మయన్మార్‌లో కొనసాగుతున్న సంఘర్షణలపై ప్రధాని మోదీ లావోస్ ప్రధాని సొనెక్సా సిఫనాడోన్‌తో చర్చించనున్నారు.

# రతన్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటు : పవన్‌కల్యాణ్



అమరావతి : ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గ్రూప్ చైర్మన్, పద్మ విభూషణ్ రతన్ నోవల్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటు అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భారత పారిశ్రామిక రంగానికి కాదు, ప్రపంచ పారిశ్రామిక రంగానికి రతన్ టాటా ఆదర్శంగా నిలిచారని ఎక్స్ వేదిక ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా నేతృత్వంలో ఉప్పు నుంచి మొదలుకొని, విమానయాన రంగంలో వరకు భారత దేశపు అణువణువులో టాటా అనే పేరు ప్రతిధ్వనించేలా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారని అన్నారు. ఆయన హయాంలో టాటాను భారతదేశపు ఉనికి గా అంతర్జాతీయ సమాజం ముందు నిలబెట్టారని, కేవలం పారిశ్రామిక వేత్తగా కాకుండా గొప్ప మానవతావాదిగా సమాజానికి చేసిన సేవలు అనిర్వచనీయమని వెల్లడించారు. ఈ బాధాకమైన సమయంలో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, టాటా గ్రూప్ సంస్థల కుటుంబ సభ్యులకు, ఆయన అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రతన్ టాటా అనే పేరు ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుందని, ప్రతీ తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం కండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 10–జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్ని మండలాల తాసిల్దారులు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, కెసి కెనాల్ ఈఈ ప్రకాష్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురాంరెడ్డి, ఎస్సార్ బీసీ ఎస్ఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 16 నుండి జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రారంభమై నవంబర్ 24వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో స్థిరీకరించిన ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని మండల తాసిల్దారులను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తెలుగు గంగ ప్రాజెక్టు కింద 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, కేసీ కెనాల్ కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,592 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎస్సార్ బీసీ కింద 9 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,925 ఎకరాలకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 43,200 ఎకరాలకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి స్థిరీకరించిన ఆయకట్టును బట్టి ప్రాదేశిక నియోజకవర్గాల వర్గీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈనెల 16 న షెడ్యూల్ వెలవడనున్న నేపథ్యంలో ఈ మేరకు ప్రాజెక్టుల వారీగా సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక్కో సాగునీటి సంఘం నుండి 6 నుండి 8 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందనీ, ఎన్నికైన సాగునీటి సంఘాల సభ్యులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ను ఎన్నుకుంటారన్నారు. ఇందుకు సంబంధించి డిఆర్ఓ ఎ.పద్మజ, ఇరిగేషన్ ఎస్ఈ వరప్రసాద్ నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లుగా డోన్ ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి, ఏఈఈ విజయ్ కుమార్ ను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# దుర్గాదేవీగా విజయవాడ అమ్మవారు



విజయవాడ, అక్టోబర్10 : ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవరోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జై దుర్గా జై జై దుర్గ అన్న నామస్మరంతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. కాగా దుర్గమును దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భవానీలు వచ్చారు. దుర్ఘతలను పోగొట్టే దుర్గాదేవిని దర్శించుకుంటే సద్గతులు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మూలానక్షత్రం (అమ్మవారి జన్మనక్షత్రం) కావడంతో రాష్ట్ర నలుమూలల భారీగా తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్ని క్యూలనూ ఉచితంగా వదిలేశారు. సామాన్య భక్తులతోపాటు, వీఐపీల తాకిడి ఎక్కువవ్వడంతో కొండ కిటకిటలాడింది. అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని దుర్గగుడి అధికారుల అంచనా. సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్ దంపతులు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం నాడు ఎలాంటి వివాదాలు, ఆటంకాలు లేకుండా భక్తులు దుర్గమ్మను సరస్వతీ అలంకారంలో దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక, పోలీసు, రెవెన్యూ, దేవదాయశాఖల మధ్య సమన్వయం కారణంగా సామాన్య భక్తులు సైతం తమకు అసౌకర్యం కలిగిందని ఎక్కడా ఫిర్యాదులు రాకపోవడం విశేషం. మూలానక్షత్రంనాడు అన్ని టిక్కెట్ దర్శనాలను ఉచితం చేశారు. లక్షల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించటంలో.. క్యూలైన్ల క్రమబద్ధీకరణలో అన్ని శాఖలు విజయం సాధించాయి.

# సంపాదకీయం

శుక్రవారం 11-10-2024

## ప్రతి భారతీయుడికి స్ఫూర్తి ప్రదాత రతన్ టాటా

పది వేల కోట్ల రూపాయలుగా ఉండవలిసిన ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఒకే ఒక్కడు తన యుక్తితో, తన వ్యాపార నిపుణతతో ఆరు లక్షల కోట్లకు ఎగబాకేలా చేశారు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ, నూట యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన టాటా గ్రూపును అందనంత ఎత్తులో నిలబడేలా చేశారు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు.. టీ నుండి ట్రక్కుల వరకు ఇలా ప్రతి వ్యాపారంలోను ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది. ఇంతటి ఘన చరిత్రను టాటా గ్రూపుకు కట్టబెట్టేలా చేశారు అతను. అతనే రతన్ టాటా. కొన్ని కోట్ల మంది భారతీయులకు ఆదర్శప్రాయులు ఈ జీవన విజేత. 1937 డిసెంబర్ 28న దేశంలోనే ధనిక కుటుంబంలో జన్మించారు రతన్. ఏడేళ్ల వయసులోనే తల్లి తండ్రులిద్దరూ విడిపోవటంతో నాయనమ్మ దగ్గర పెరగవలిసి వచ్చింది. తన చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని జె.ఆర్.డి. టాటా పిలుపు మేరకు జంషెడ్ పూర్ లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు రతన్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగగలిగారు రతన్. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పని చేసిన తరువాత 1991లో జె.ఆర్.డి. టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు రతన్. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు ఆఫ్ మెంబెర్స్ లో చాలా మంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. కానీ వారికి ఆనాడు తెలియదు పాపం ఇతడే టాటా గ్రూప్ ను దశ దిశలా వ్యాపించే ఘనుడు అవుతాడని.చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత టాటా గ్రూపులో సమూల ప్రక్షాళన చేశారు రతన్. రాత్రి, పగలు కష్టపడి పది వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని తన అసాధారణ వ్యాపార నైపుణ్యంతో ఆరు లక్షల కోట్ల విలువ చేసే కంపెనీగా మార్చారు రతన్. దేశ వాణిజ్య , పారిశ్రామిక పురోగతిలో కీలక పాత్ర పోషించారు. నేడు టాటా గ్రూప్ 90కి పైగా దేశాలలో విస్తరించి వందకు పైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబడింది. వ్యాపార సామ్రాజ్యంలో ఒక శిఖరంగా ఎదగగలిగింది. ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో కేవలం లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెను సంచలనాన్నే సృష్టించాడు రతన్.టాటా గ్రూప్ భారతదేశానికి ఎన్నో కొత్త కొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియాగా పిలబడుతున్న విమానయాన సంస్థను మొదట టాటాఎయిర్ లైన్స్ పేరుతో 1868 లో జంషెడ్ జీ టాటా స్థాపించారు. కాలక్రమంలో అది కాస్త ప్రభుత్వం చేతిలోకి వెళ్ళింది. అలాగే భారత దేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్ హోటల్ ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్ కు చెందిన టెట్లీ అనే కంపెనీని టాటా టీలో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద టీ కంపెనీగా టాటా టీ ఎదిగింది. అంతే కాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూపులో కలుపుకొని టాటాను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేశారు. 1998లో టాటా ఇండికా కార్లను ప్రవేశ పెట్టారు. అయితే దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటంతో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించారు. ఇందుకోసం అమెరికాలోని ఫోర్డ్ కంపెనీకి తన టీంతో పాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ చైర్మన్, రతన్ టాటాను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని అవమానించారు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాల నుండి లాభాలలోకి రావటం మొదలు పెట్టింది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా, అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్, లాండ్ రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయంలోనే రతన్ ఆ రెండు కంపెనీలను నేను కొంటాను అని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేశారు. అప్పుడు ఫోర్డ్ కంపెనీ చైర్మన్ తన టీంతో అమెరికా నుండి ముంబైకు వచ్చారు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పారు రతన్. నానో కార్ల ఉత్పత్తి కోసం పశ్చిమ బెంగాల్ లో ఏర్పాటు చేసిన ప్లాంటును అక్కడి రైతులు వ్యతిరేకించడంతో, ఆ ప్లాంటు మరొక చోటుకు మార్చటంతో వేల కోట్ల నష్టాన్ని చూడవలసి వచ్చింది. పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తాజ్ హోటల్ పై జరిపిన ఉగ్ర దాడిలో వందల మంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన రతన్ ను మానసికంగా ఎంతో బాధించింది.లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంత వరకు ఏనాడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66 శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వటం జరుగుతుంది. దేశ సామజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టులు ఎంతగానో కృషి చేస్తున్నాయి. తాజ్ ఉగ్ర దాడిలో నష్టపోయిన వారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారిగా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా. తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి.

## ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తీర్చాలి

×ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ×అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల పట్టాలు




విభారె న్యూస్ అక్టోబర్ 10 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :– మున్సిపల్ సమావేశంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క కౌన్సిలర్ హాజరుకావాలని మీ వార్డులలో ఏమైనా సమస్యలు ఉంటే కౌన్సిల్ సమావేశంలో తెలపాలని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల తీర్చాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో కొన్ని సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో 100 కోట్లు శాంక్షన్ చేశాడు గాని ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని గడిచిన ఐదేళ్లు సంవత్సరాలు ఆళ్లగడ్డ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని వైసిపి ప్రభుత్వం చెప్పడమే తప్ప చేసేదేమి లేదన్నారు.ఆళ్లగడ్డ ప్రజలకు ముఖ్యంగా కావలసింది వేసవికాలంలో త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉండడం వలన మన సీఎం నారా చంద్రబాబునాయుడు గారిని కన్లేరు రిజర్వాయర్ 0.6 ఉన్న టీఎంసీ ల నుండి 0.9 టీఎంసీ లకు పెంచాలని కోరిన వెంటనే స్పందించిన సీఎం నారా చంద్రబాబునాయుడు సంబంధిత మంత్రులతో మాట్లాడి 40 కోట్ల రూపాయలతో ఈ వర్క్ ను ప్రారంభించబోతున్నారన్నారు. ఆళ్లగడ్డ పురపాలక సంఘం కు సంబంధించి మున్సిపల్ సమావేశానికి కొత్తగా మున్సిపల్ హాల్ ఒకటి నిర్మిస్తానని ఇందులో మున్సిపల్ సమావేశాలే కాకుండా అంగన్వాడీ సమావేశాలు ఏమైనా ఉన్నా కూడా ఉపయోగపడుతుందని సంబంధిత మంత్రి నారాయణతో ఆల్రెడీ మాట్లాడడం జరిగిందని ఆళ్లగడ్డ అభివృద్ధికి ఎంతైనా కృషి చేస్తానని తెలిపారు.మున్సిపాలిటీకి సంబంధించి అన్నిచోట్ల స్ట్రీట్ లైట్లకు గతంలో కాంట్రాక్టర్ కి ఇచ్చి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా చూసుకునేవాళ్ళం కానీ గత ప్రభుత్వంలో ఈ ఈ ఎస్ ఎల్ కంపెనీకి 400 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టడం వలన ఇప్పుడు ఎక్కడ కూడా స్ట్రీట్ లైట్ వర్కులు జరగడం లేదు అని మంత్రి నారాయణ తో చెప్పగా స్పందించిన మంత్రి నారాయణ స్ట్రీట్ లైట్స్ కి సంబంధించి కచ్చితంగా గతంలో లాగే కాంట్రాక్ట్ ఇచ్చి స్ట్రీట్ లైట్లు ఇబ్బంది లేకుండా చూసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది.ఆళ్లగడ్డ పట్టణంలో ప్రతి ఒక్క కౌన్సిలర్ కి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని మంత్రి నారాయణ తో చర్చించడం జరిగిందన్నారు ఎందుకంటే మీ వార్డుల్లో ఎన్నో సమస్యలు మీ దృష్టికి వస్తుంటాయి కనుక ప్రజలందరికీ దగ్గరగా ఉండి సమస్యలను తీర్చాలి కాబట్టి ఈ పది లక్షల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ముఖ్యంగా కాలువలు రోడ్లు చాలాచోట్ల ఇబ్బంది పడుతున్నారని ప్రతి ఒక్కటి త్వరలోనే నెరవేరుస్తానని ఆళ్లగడ్డ ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ఆళ్లగడ్డ ప్రజలందరూ ఏ సమస్య ఉన్నా కూడా నా దృష్టికి తీసుకొని రావాలని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సమస్యలు పరిస్కరిస్తామన్నారు.నిరుపేదలకు ఇచ్చిన టిట్కో గృహాల్లో ఎవరెవరో ఉన్నారని కచ్చితంగా ఎవరికైతే ఇల్లు లేక స్థలం లేక ఇబ్బంది పడుతున్న వారికి మాత్రమే టిట్కో గృహాలు ఉండాలని గతంలో టిట్కో గృహాలకు అప్లై చేసిన వారికి కొంతమందికి రాలేదని ఎవరైతే రాని వాళ్ళు ఉన్నారో వారి డిపాజిట్ చేసిన అమౌంట్ వాళ్ళకి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కు తెలియజేశారు.సమావేశంలో భాగంగా గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తానని చెప్పి మోసం చేశారని కానీ కచ్చితంగా మేము ఆళ్లగడ్డ పట్టణంలో నెక్స్ట్ మున్సిపల్ సమావేశంలోపు అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం మంజూరు చేసి పట్టాలు ఇస్తాము అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పవన్ మార్క్ పాలిటిక్స్...



ఏలూరు, అక్టోబరు 10, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. గతంలో ప్రజా ప్రతినిధిగా కూడా చేయని ఆయన నేరుగా డిప్యూటీ సీఎం అయ్యారు. ఏరి కోరి పంచాయతీ రాజ్ శాఖలు తీసుకున్నారు. ఆయన అలా తీసుకోవడం వెనుక ప్రతి పల్లెలో తనదైన ముద్ర వేయాలన్న సంకల్పం ఉందని తాజాగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో స్పష్టమవుతోంది. గ్రామ సీమల్లో గత ఐదేళ్ల పాటు జరగని పనుల్ని ఇప్పుడు ప్రారంభించబోతున్నారు. ఇందు కోసం పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఖరారు చేశారు. పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహింప చేశారు. అందుకు వరల్డ్ రికార్డ్ యూనియన్ అవార్డు కూడా లభించింది. ఆ గ్రామ సభలను రికార్డు కోసం నిర్వహించలేదు. గ్రామాల్లో ఉన్న సమస్యలను నమోదు చేసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఏ ఏ పనుల్ని చేయాలో కూడా ఆయా పంచాయతీలే ప్రజల అభిప్రాయాల మేరకు నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఆయా పనుల్ని చేయించడానికి పవన్ కల్యాణ్ ఏర్పాట్లు చేశారు. పూర్తి స్థాయిలో నిధుల లభ్యత, కొరత లేకుండా చూస్తూ అభివృద్ధి పనుల్ని ప్రారంభించేందుకు పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఖరారు చేశారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో చిన్న చిన్న పనులకూ అవకాశం లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి ఉంది. రోడ్ల దగ్గర నుంచి అనేక మౌలిక సదుపాయాల పనులు జరగాల్సి ఉంది. గ్రామ సభల్లో ఎక్కువగా ఇలాంటి పనులకు ప్రతిపాదనలు వచ్చాయి.దీ దీంతో పవన్ కల్యాణ్ గ్రామ సభల ద్వారా ఆయా పనులకు ఆమోదం తీసుకున్నారు 2024?25 ఏడాదికిగాను రూ.4,500 కోట్ల నిధులతో పనులకు గ్రామ సభల ఆమోదం తెలిపేలా చేయగలిగారు. ఈ పనులన్నింటినీ ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనుల ప్రారంభం కోసం ప్రత్యేకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని ఖరారు చేశారు. 30 వేల పనులకి పల్లె పండుగలో శ్రీకారం చుట్టబోతున్నారు. ప్రతి విషయంలోనూ ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూసుకుంటున్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మంజూరైన పనులకు పండుగ వాతావరణంలో భూమిపూజను పల్లె పండుగలో చేయనున్నారు. అక్టోబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండుగ ? పంచాయతీ వారోత్సవాలు' జరుగుతాయి. రాజకీయంగా సనాతన ధర్మ పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టి హిందూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తున్న పవన్ కల్యాణ్ మరో వైపు తన బాధ్యతల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయడం లేదు. సమర్థవంతమైన అధికారుల టీమ్ ను ఏర్పాటు చేసుకున్న ఆయన తన ఆలోచన మేరకు పనులు శరవేగంగా జరిగేలా చూసుకుంటున్నారు. ప్రతి గ్రామంలోనూ పవన్ కల్యాణ్ పనులు చేయించారు అనే ముద్ర ఉండేలా చూసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అడ్మినిస్ట్రేటర్ కూడా ఆయన మంచి గుర్తింపు సాధించడం ఖాయమని అనుకోవచ్చు.

## లడ్డూ సిట్ నియామకం ఎప్పుడో..?


అమరావతి,తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదానికి ఉపయోగించే నెయ్యి విషయంలో జరిగిన కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సీబీఐ, సిట్, అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అప్పటికే ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణ ఆపేసింది. దాంతో కొత్త సిట్ ను వెంటనే నియమిస్తారని, విచారణ ప్రారంభిస్తారని అనుకున్నారు. కానీ సిట్ నియామకంపై ఇంత వరకూ అధికారిక ప్రకటన రాలేదు.సిట్ నియామకం, విచారణపై సుప్రీంకోర్టు ఎలాంటి గడువు పెట్టకపోవడంతో నింపాదిగా ఉంటున్నట్లుగా తెలుస్తోంది. సుప్రీంకోర్టుకు దసరా సెలవులు అయ్యేలోపు నియమించే అవకాశం ఉంది. సీబీఐ చీఫ్ దర్యాప్తును పర్యవేక్షిస్తారు. ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు ఏపీలోని సిట్ బృందంలో ఉన్న వారు. ఒక అధికారిని ఖరారు చేయాల్సి ఉంది. వీరిని ప్రకటిస్తే, దర్యాప్తు వేగంగా జరిగే అవకాశం ఉంది. ఒక వేళ సిట్ ఏర్పాటులో ఆలస్యం అయితే కేసు షెడ్డుకెళ్లే అవకాశం ఉంది.

## దుర్గాష్టమిని పురస్కరించుకొని దుర్గాదేవిగా దర్శనమిచ్చిన పార్వతీ మాత..




విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. స్థానిక శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవములును పురస్కరించుకొని గురువారం దుర్గాష్టమి సందర్భంగా శ్రీ పార్వతి దేవి అమ్మవారికి దుర్గాదేవిగా అలంకరణ గావించారు. అలంకారమును వంశపారంపర్య ధర్మకర్త వారి కుటుంబ సభ్యులచే అలంకరణను గావించారు. భక్తులకు దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

## దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాత.



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకొని వాసవి మాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మ వారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు.

## దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చిన జమ్ములమ్మ.



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. పట్టణంలోని సోగనూరు రోడ్డులో వెలసిన శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయంలో దసరా నవరాత్రులలో భాగంగా గురువారం దుర్గాష్టమి పురస్కరించుకొని దుర్గామాతగా జమ్ములమ్మ దేవిని అలంకరించారు. ఆలయ కమిటీ ధర్మకర్త తట్టే బుడ్డప్ప ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అలంకరణను ఆలయ ధర్మకర్త తట్టే బుడ్డప్ప కుటుంబ సభ్యులుచే అలంకరణ గావించారు. దుర్గామాతను దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు.


## దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చిన చౌడేశ్వరి దేవి



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. స్థానిక చౌడేశ్వరి వీధిలో ఉన్న శ్రీరామలింగేశ్వర చౌడేశ్వరి దేవాలయంలో దుర్గామాత అలంకరణలో చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాష్టమి పురస్కరించుకొని గురువారం రోజు చౌడేశ్వరి మాతను దుర్గామాతగా అలంకరణ గావించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

# ఏపీలో కలర్ బుక్స్ రాజకీయం

విజయవాడ, అక్టోబరు 10, తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఎప్పుడూ దేశ రాజకీయాల కంటే ముందే ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎవరూ ఊహించని ఘటలు చోటు చేసుకుంటూ ఉంటాయి. కొత్త కొత్త సంప్రదాయాలకు తెరతీస్తుంటారు ఇక్కడి నాయకులు. అక్కడ ఏం చేసినా ట్రెండ్ సెటర్‌గా మారుతూ ఉంటుంది. ఇప్పుడు కూడా అలాంటి ట్రెండింగ్ ఇష్యూ ఒకటి చర్చనీయాంశమవుతుంది. ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో బాగా వినిపిస్తున్న పేరు రెడ్ బుక్. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని బేస్ చేసుకొని పాలన సాగుతోందని ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టేలా చర్యలు తీసుకుంటున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. దానికి అధికార పార్టీ నుంచి ముఖ్యంగా టీడీపీ నుంచి కౌంటర్ గట్టిగానే ఉంటోంది. అందుకే వైసీపీ కూడా తాము పుస్తకాలు రాస్తు?నామని అందరి పేర్లు నోట్ చేస్తున్నామని ప్రచారం చేస్తోంది. ప్రతిపక్షంలో ఉన్న యువగళం పాదయాత్ర చేపట్టిన ప్రస్తుతం మంత్రి నాటి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ రెడ్‌బుక్‌ను బాగా వాడుకున్నారు. తన చేతిలో ఉన్న రెడ్ బుక్‌ను చూపిస్తూ అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టే వారి పేర్లు, కేడర్‌ను హింసించేవారి రాస్తున్నామని కచ్చితంగా ఇంతకు ఇంత చెల్లిస్తామని వారందరిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించేవాళ్లు. దానికి ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున స్పందన వచ్చేది. తర్వాత క్రమంలో రెడ్ బుక్ పేరు మీద పెద్ద పెద్ద హోర్డింగ్స్ కూడా పెట్టారు. 2024 ఎన్నికల్లో దీన్నే ప్రచార అస్త్రంగా టీడీపీ వాడుకుంది. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ఆ రెడ్‌బుక్‌పై బాగా సెటైర్లు వేసింది. మతి మరుపు ఉన్న వ్యక్తి ఇలాంటి రాసుకుంటారని... లోకేష్‌కు అంత సీన్ లేదని విమర్శించింది. అధికారంలోకి వచ్చేది లేదు చేసేదేం లేదని కూడా ఎద్దేవా చేసింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దానికి వైసీపీ పెద్దగా ప్రాధాన్యత కూడా ఇవ్వలేదు.కాలం గిర్రున తిరిగింది. 2024లో వైసీపీ అధికారం కోల్పోయింది. కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు రెడ్ బుక్ మాటను ఎన్నికల వరకు చెప్పిన టీడీపీ సైలెంట్ అయినా... వైసీపీ అందుకుంది. అంతే చేసిన ప్రతి పని వెనుక ఈ రెడ్ బుక్ ఉందంటూ ఆరోపిస్తోంది వైసీపీ. ఎవరిని అరెస్టు చేసినా, ఏ అధికారిని బదిలీ చేసినా, ఎవరిపై చర్యలు తీసుకున్నా దానికి రెడ్ బుక్ కారణమని విమర్శలు చేస్తూ



వస్తోంది. దీనిపై మాట్లాడిన లోకేష్ రెడ్‌బుక్ గురించి చెప్పుకోవడానికి తామేమీ వెనకాడబోమన్నారు. ఎన్నికలకు ముందు నుంచే రెడ్‌బుక్ పట్టుకొని ఊరూరా తిరిగామని చెప్పుకొచ్చారు. ప్రజలు తమ విధానాలతోపాటు ఈ రెడ్‌బుక్‌ను చూసి కూడా ఓట్లు వేశారని అన్నారు. రెడ్‌బుక్‌లో తప్పు చేసిన వారి పేర్లు ఉన్నాయని... వారిపై చట్ట ప్రకారం చర్యలు కచ్చితంగా ఉంటాయని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రెడ్‌బుక్ ను లైట్ తీసుకొని ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత దాన్ని బూచిగా చూపించడంతో వైసీపీపై సొంతపార్టీలోనే విమర్శలు వచ్చినట్టు తెలుస్తోంది. అందుకే రెడ్ బుక్‌పై ఆరోపణలు చేస్తూనే... కేడర్‌కు ధైర్యం చెప్పేందుకు కొత్త పంథాను ఎంచుకుంది వైసీపీ అధినాయకత్వం. అందుకే తరచూ ఆ పార్టీ నేతల నోట బుక్ ప్రస్తావన వచ్చేది. ఇప్పుడు ఏకంగా అధినేత జగన్ మోహన్ రెడ్డే తాము కూడా రెడ్‌బుక్ రాయడం మొదలు పెట్టామంటున్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు చేసిన తప్పులను రెడ్‌బుక్‌లో నోట్ చేస్తామంటున్నారు. అంతే కాకుండా పార్టీ కోసం కష్టపడే లీడర్ల కోసం గుడ్ బుక్ రాస్తున్నామని అన్నారు. వివిధ జిల్లాల నేతలతో సమీక్షలు నిర్వహిస్తున్న జగన్ ఈ బుక్స్‌పై స్పందించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఫెయిల్ అయిందని ఆరోపించిన ఆయన... కచ్చితంగా అన్నింటినీ, అందరి పేర్లను మా వాళ్లు నోట్ చేస్తున్నారని అన్నారు. ఇలాంటి దుష్ట సంప్రదా యానికి చంద్రబాబు శ్రీకారం చుట్టా రని చెప్పారు. రెడ్‌బుక్ మెయింటైన్ చేయడం పెద్ద కష్టం కాదని అందుకే రెండు పుస్తకాలు రాస్తున్నామన్నారు. రెడ్‌బుక్‌తోపాటు గుడ్ బుక్ ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలో నియోజకవర్గం నేతలతో మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు..."నేను గ్రీన్ బుక్ రాయడం మొదటు పెట్టా, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు పేరు గ్రీన్ బుక్‌లో రాస్తా. అధికారంలోకి వచ్చాక గ్రీన్ బుక్‌లో ఉన్న ప్రతి కార్యకర్తకు మేలు చేస్తా అని చెప్పారు. తెలంగాణలో కూడా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి బుక్ పేరు పదే పదే ప్రస్తావించేవాళ్లు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదు. ఇప్పుడు బీఆర్ఎస్ వాళ్లు ఈ ప్రస్తావన చేస్తున్నారు. తప్పు చేసిన నాయకులు, అధికారుల పేర్లు నోట్ చేస్తున్నామని హెచ్చరిస్తున్నారు. ఇలా ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు అధికార పార్టీ వ్యూహాలను చిత్తు చేయడానికో, లేదా తమ ప్లాన్ వర్కౌట్ చేయడానికో ఇలా బుక్స్ పేర్లతో రాజకీయం చేస్తుంటారు. ఇది ఇప్పుడు తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ట్రెండు సృష్టించిందని అంటున్నారు.

# మెగా డీఎస్సీకి అంతా సిద్ధం...

కాకినాడ, అక్టోబరు 10, ఆంధ్రప్రదేశ్ మెగా డిఎస్సీ నోటిఫికేషన్ నవంబర్ మొదటి వారంలోనే విడుదల కానుంది. డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ను నవంబరు 3న విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీలో డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న 'టెట్ పరీక్షల ఫలితాలను నవంబరు 2న ప్రకటిస్తారు.టెట్ ఫలితాలు వెలువరించిన మరుసరటి రోజే మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యాశాఖ యోచిస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని భావించినా మరింత మంది అభ్యర్థులకు టెట్ అర్హతకు అవకాశం కల్పించడంలో భాగంగా తొలుత టెట్ నిర్వహించారు. ప్రస్తుతం టెట్ 2024 పరీక్షలు కొనసాగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మెగా డిఎస్సీలో ఎలాంటి న్యాయవివాదాలకు తావివ్వకుండా చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారుల్ని ఇప్పటికే ఆదేశించారు.టెట్, మెగా డీఎస్సీ మధ్య ఎక్కువ సమయం ఉండాలని అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో అభ్యర్థులు, విద్యార్థి, యువజన సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఇప్పటికే ఆశావహులు కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉద్యోగాలు మానుకుని పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఉద్యోగ ప్రకటన చేసిన ఆర్నెల్లకు మించి ఆలస్యమైతే అభ్యర్థుగా భారమవుతుందని భావించారు. దీంతో నవంబర్‌లోనే డిఎస్సీ పరీక్షల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.డిఎస్సీ 2024 సిలబస్ విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ప్రభుత్వం ఇప్పటికే తోసిపుచ్చింది. మెగా డీఎస్సీలో కొన్ని జిల్లాలకు పలు విభాగాల్లో తక్కువ పోస్టులు వచ్చాయంటూ పలువురు అభ్యర్థులు తనని కలిసిన విషయాన్ని లోకేష్ అధికారుల వద్ద ప్రస్తావించి వివరాలు అడిగారు. ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులపై కొంతమంది కోర్టును ఆశ్రయించారని, దీనివల్ల పోస్టులు తగ్గాయని అధికారులు వివరణ ఇచ్చారు.అనంతపురం, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో పోస్టులకు సంబంధించి న్యాయపరమైన వివాదాలను పరిష్కరించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని లోకేష్ అధికారులను ఆదేశించారు. స్కూళ్ల మూసివేతకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ. 117 వలన ఎటువంటి నష్టం కలిగిందన్న విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలోకి రావటంతో టీచర్ ఉద్యోగ అభ్యర్థులకు భారీ శుభవార్తను చెప్పిన సంగతి తెలిసిందే. మెగా డీఎస్సీ దస్త్రంపై చంద్రబాబు తొలి సంతకం కూడా చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ కూడా కసరత్తు షురూ చేసింది. ఇందుకు సంబంధించి కీలక ప్రకటన చేసింది.

పోస్టుల వివరాలు?

తాజాగా వచ్చే నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 6,371,స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)- 7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీలు)-1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీలు)-286, ప్రిన్సిపాళ్లు 52, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు)-132 ఉద్యోగాలు ఉన్నాయి.

స్కూల్ అసిస్టెంట్ - 7,725
ఎస్‌జీటీ - 6371
టీజీటీ - 1781
పీజీటీ - 286
పీఈటీ - 132
ప్రిన్సిపల్స్ - 52

త్వరలోనే కొత్త నోటిఫికేషన్?.

వైసీపీ ప్రభుత్వం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి.ఈ నోటిఫికేషన్ కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తి అయింది. డీఎస్సీతో పాటే టెట్ నోటిఫికేషన్ ను విడుదల చేసింది. టెట్ ఫలితాలు రావాల్సి ఉంది. ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ తో డీఎస్సీ పరీక్షలు మాత్రం వాయిదా పడుతూ వచ్చాయి. ఇంతలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో?. సీన్ మారిపోయింది. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదలకు శ్రీకారం చుట్టింది.

ప్రక్రియ పూర్తికి డెడ్ లైన్?.

విద్యాశాఖ కొత్తగా ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. గత డీఎస్సీ ప్రకటనను అనుసరించి దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయక్కర్లేదు. కొత్తగా ఏ జిల్లాలకైనా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఛాన్స్ ఇవ్వనున్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొత్తం ప్రక్రియను 6 నెలల్లోపే పూర్తి చేయనున్నారు.

# ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శలు సరికావు

జమ్మలమడుగు,సీఎం చంద్రబాబు నాయుడుని, మా చిన్నాన్న ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి విమర్శించడం సరికాదని జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇంచార్జీ భూపేష్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు 74 వయసులో 24 సంవత్సరాల యువకుని లాగా పనిచేస్తున్నారని తెలిపారు.మా చిన్నాన్న ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై రూట్ మ్యాప్ పెట్టుకుని పనిచేస్తున్నారని తెలిపారు.పనిచేసే వ్యక్తిని విమర్శిస్తే ఏ విధమైన ఆవేశం వస్తుందో ఆ ఆవేశమే తప్ప మా చిన్నాన్నకు మరే ఉద్దేశం లేదన్నారు.ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి దానిని అవకాశంగా తీసుకుని విమర్శించడం తగదని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి లు కలిసి వైసీపీలో ఉన్నా, సుధీర్ రెడ్డి గతంలో రామ సుబ్బారెడ్డిని ఏ విధంగా విమర్శించారో మాకు తెలుసన్నారు.అప్పుడు ఏ స్వలాభంతో , వ్యక్తిగత ప్రయోజనాలతో నోరు మెదపకుండా ఉన్నారని ప్రశ్నించారు. తాము ఏ పార్టీలో ఉన్నా కార్యకర్తలు, అభివృద్ధి కోసమే మా తపనని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండి ఏదైనా అభివృద్ధి కోసం సలహాలు ఇస్తే తీసుకుంటామని తెలిపారు.

## ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

కాకినాడ,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు దసరా పండుగకు చుట్టాలు వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడ్డ జిల్లా ప్రజలు పండగ కోసం జిల్లాకు వస్తున్నారు. దీంతో బస్సులకు డిమాండ్ పెరిగింది. ఆర్టీసీ బస్సులు వారికి బాగా ఉపయోగపడుతున్నాయి. వాయిస్: ప్రైవేట్ బస్సులు విపరీతంగా రేట్లు పెంచేసాయి .ఇలాంటి నేపథ్యంలో ఆర్టీసీ రేట్లు పెంచలేదు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. కాకినాడ విశాఖ, కాకినాడ హైదరాబాద్ మధ్య ప్రతిరోజు 100కు పైగా బస్సులు నడుపుతున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది

# టీజీకి పదవి ఖాయమేనా

కర్నూలు, అక్టోబరు 10, ఆంధ్రప్రదేశ్ లో సీనియర్ నేత టీజీ వెంకటేశ్ త్వరలోనే పదవి లభిస్తుందన్న ప్రచారం ఊపందుకుంది. భారతీయ జనతా పార్టీ ఆయనకు అతి త్వరలోనే గుడ్ న్యూస్ చెబుతుందంటున్నారు. ఈ మేరకు హైకమాండ్ వద్ద కూడా ప్రతిపాదనలున్నాయని చెబుతున్నారు. టీజీ వెంకటేశ్ 2014లో కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. అయితే కర్నూలు పట్టణ నియోజకవర్గం నుంచి ఓటమిపాలు కావడంతో ఆయనకు టీడీపీ నుంచి రాజ్యసభ పదవి దక్కింది. టీడీపీలో కీలకంగా ఉన్న టీజీ వెంకటేశ్ తర్వాత 2019 ఎన్నికల్లో టీడీపీ ఏపీలో ఓటమి పాలయిన తర్వాత నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఆయన కూడా బీజేపీలో చేరిపోయారు.ఆయన బీజేపీలోనే కొనసాగుతున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన బీజేపీ పెద్దలను ఆకట్టుకున్నారు. వారి దృష్టిలో పడ్డారు. టీజీ వెంకటేశ్ కేవలం సామాజికవర్గం పరంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా బలవంతుడు కావడం ఆయనకు అదనపు బలం అయింది. ఢిల్లీలో ఆయనకున్న పరిచయాలను గత మూడేళ్లలో పెంచుకున్నారు. నేరుగా మోదీ, అమిత్ షాతో ఆయన పరిచయాలను బాగా పెంచుకున్నారు. తన కుమారుడు టీజీ భరత్ ను మాత్రం 2014 నుంచి టీడీపీలోనే ఉంచారు. టీజీ భరత్ 2019 ఎన్నికలలో కర్నూలు నుంచి ఓటమి పాలయినా 2024 లో మళ్లీ అదే టీడీపీ నుంచి గెలిచి చంద్రబాబు కేబినెట్ లో పరిశ్రమల శాఖ మంత్రిగా చేరారు.కుమారుడి రాజకీయ భవిష్యత్ లో టీజీ వెంకటేశ్ కు ఇక దిగులు లేదు. అయితే తన వయసు మించి పోవడంతో ఇక ప్రత్యక్ష ఎన్నికలకు ఆయన దాదాపు దూరమయినట్లే. అయితే రాజకీయాలను వదిలే అవకాశం మాత్రం లేదు. కమలం పార్టీలోనే ఉంటూ ఎదగాలన్నది ఆయన ఆలోచన. కర్నూలులోనే ఉండి ఆయన హస్తిన పెద్దలతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. కమలం పార్టీని రాయలసీమలో బలోపేతం చేయాలను కుంటే తన ఏదో ఒక గౌరవమైన పదవి ఇవ్వాలని టీజీ వెంకటేశ్ కోరినట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలు టీజీ వెంకటేశ్ కు దక్కే ఛాన్స్ లేదు. ఎందుకంటే అవి టీడీపీ, జనసేనలకు రిజర్వ్ అయిపోయాయి.టీడీపీ నుంచి వచ్చిన నేత కావడం కొంత టీజీ వెంకటేశ్ కు మైనస్ అయినా ఆయన పార్టీ ఆర్థిక అవసరాలను తీర్చే నాయకుడు కావడంతో బీజేపీ పెద్దలు కూడా టీజీ వెంకటేశ్ కు పదవి ఇచ్చేందుకు సిద్ధమయినట్లు తెలిసింది. ఆయన వయసును గౌరవిస్తూ గవర్నర్ పదవిని ఇవ్వాలని దాదాపు నిర్ణయం జరిగిపోయినట్లు సమాచారం. ఈ మేరకు టీజీ వెంకటేశ్ తన సన్నిహితుల వద్ద కూడా చెబుతున్నట్లు తెలిసింది. ఆయనకు ముఖ్యమైన రాష్ట్రానికి గవర్నర్ గా అతిత్వరలోనే నియమిస్తున్నట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి టీజీ వెంకటేశ్ కు గవర్నర్ పదవి దక్కుతుందా? లేదా? అన్నది తెలియాలంటే కొంత కాలం ఆగాల్సిందే.

# బుల్లెట్ ట్రైన్...వయా అమరావతి

విజయవాడ, అక్టోబరు 10, అమరావతికి ప్రధాన నగరాల నుంచి కనెక్టివిటీ పెంచేందుకు చంద్రబాబు చేస్తున్నప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. వచ్చే పదేళ్ల నాటికి అమరావతి మొత్తం ఓ రూపునకు వస్తుంది. ఉద్యోగ, ఉపాధినగరంగా మారుతుంది. అప్పటికల్లా బుల్లెట్ ట్రైన్ కూడా అమరావతికి వచ్చేలా చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఢిల్లీ పర్యటన తర్వాత చంద్రబాబునాయుడు అమరావతికి బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనల గురించి మీడియాకు తెలిపారు. దక్షిణాదిలో మూడు అతి పెద్ద మెట్రో నగరాలు ఉన్నాయి. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాజధానులు బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. ఈ బుల్లెట్ ఏపీ రాజధాని అమరావతి మీదుగా వెళ్లనుంది. అంటే.. ప్రధాన నగరాలను కలుపుతూ వెళ్లే బుల్లెట్ ట్రైన్ అమరావతి మీదుగా వెళ్తుంది. వచ్చే పదేళ్లనాటికి ఈ బుల్లెట్ ట్రైన్ పట్టలెక్కినా అప్పటికి అమరావతి కూడా ఓ రూపానికి వస్తుంది. బుల్లెట్ ట్రైన్ ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జపాన్ సహకారంతో ముంబై టు అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్‌కు శంకుస్థాపన చేశారు. ఇప్పటికి దాదాపుగా పదేళ్లు అవుతోంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో నిర్మాణం పుంజుకోలేదు. ఎప్పటికి తొలి పరుగు పెడుతుందో చెప్పలేని పరిస్థితి. లక్ష కోట్లకుపైగా ఖర్చు అయ్యే ప్రాజెక్టు కావడంతో ఆర్థిక సమస్యలూ వెంటాడుతున్నాయి. అయినా కేంద్రం.. ముందు ముందు బుల్లెట్ ట్రైన్స్‌కు డిమాండ్ పెరుగుతుందని గట్టి నమ్మకంతో ఇతర ప్రాంతాల్లోనూ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బుల్లెట్ ట్రైమ్ మాత్రమే కాకుండా హైస్పీడ్ రైళ్ల నెట్ వర్క్ పైనా ప్రత్యేకంగా ఆలోచనలు చేశారు. మొత్తం ఏడు మార్గాల్లో హైస్పీడ్ రైళ్లను ప్రతిపాదించారు. కానీ అమరావతి మార్గంలో మాత్రం బుల్లెట్ ట్రైన్‌నే ప్రతిపాదించారుబుల్లెట్ ట్రైన్ల కోసం ప్రస్తుతం ఉన్న ట్రాకులు పనికి రావు. దాని కోసం ప్రత్యేకంగా ట్రాక్ వేయాల్సి ఉంటుంది. బులెట్ ట్రైన్ అనుసంధానంతో పెరగనున్న ఎకానమీ ఆక్టివిటీస్ పెరుగుతాయని.. 2026 నుండి బులెట్ ట్రైన్ పనులు ప్రారంభం అవుతాయని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర రైల్వే శాఖ పూర్తి స్థాయి డీపీఆర్ రెడీ చేసిన తర్వాత ప్రకటన ఇచ్చే అవకాశం ఉంది. సాఫ్ట్ వేర్ రంగాల్లో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి సాధిస్తు?నాయి. మూడు నగరాల మధ్య ప్రయాణాలు కూడా ఎక్కువగా ఉంటాయి. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తే ఆదరణ ఉంటుందని నమ్ముతున్నారు. అమరావతికి అన్ని వైపు నుంచి కనెక్టివిటీ పెరిగితే.. అభివృద్ధి కూడా వేగంగా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు నమ్మకంతో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకమైన ఆసక్తితో రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా సౌకర్యాలు మరింత పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రూపాయి పల్లె గురించి తెలుసా...

శ్రీకాకుళం, అక్టోబరు 10, రూపాయి అధికారిక మారక ద్రవ్యం. భారతీయ కరెన్సీలో రూపీని రూపాయిగా పిలుస్తాం. ఇదే పేరుతో ఓ గ్రామం ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలో ఉన్న గిరిజన గ్రామం పేరే రూపాయి. అక్కడ నివశించేది అందరు గిరిపుత్రులే. సీతంపేట ఐటీడీఏ, మండలంలో కొతతగా చేరిన అధికారులు ఎవరైనా సరే ఒక్కసారైనా రూపాయి గ్రామాన్ని చూసి వస్తారు. పూర్వం కాలం నుంచి గ్రామానికి వచ్చిన పేరు అది కాదని స్థానికులు చెబుతుంటారు. చుట్టు పక్కల గ్రామల కంటే ఇ పల్లె ఆర్థికంగా బాగా మెరుగ్గా ఉండేదట. అప్పటి నుంచి దీన్ని రూపాయి గ్రామంగా పిలుస్తున్నారు. వాళ్లంతా పక్కనే ఉన్న గ్రామంలో మేకలను రూపాయికే కొనుగోలు చేసేవారట. దీంతో ఆ గ్రామం పేరు రూపాయిగా మారిందని చెప్పుకొస్తున్నారు. ఆ గ్రామ ఆదివాసీలు పండించే పంటలను మైదాన ప్రాంతంలో విక్రయించేవారు. అప్పట్లో వస్తువులు అమ్ముకుని తేచ్చే నాణేలను ఇంటి వద్ద జాగ్రత్త చేసే వాళ్లు. మరికొందరు భూమిలో పాతిపెట్టేవారట. అలా ఉంచిన నాణేలు చిలుము పట్టడంతో వాటిని చింత పండుతో కడిగి ఆరబెట్టేవాళ్లట. దీంతో ఆ గ్రామానికి రూపాయి ఊరుగా ఫిక్స్ చేశారంటూ మరో కథను వినిపిస్తున్నారు. కారణం ఏమైనా సరే రూపాయి పేరుతో ఆ గిరిజన ఏజెన్సీలోనే గ్రామానికి ప్రత్యేకత ఉంది. వినడానికి చిత్రంగా ఉన్న పేరుతో చాలాసార్లు గిరిపుత్రులు నవ్వులపాలు అయ్యామని చెబుతున్నారు. మైదాన ప్రాంతాలకు వచ్చి ఊరు చెబితే ఎదుటి వాళ్ల నవ్వుకునే వాళ్లు. మరికొందరు వెటకారంగా పిలిచే వారని ఇలాంటివి చాలా ఎదుర్కొన్నామని చెబుతున్నారు. ఇప్పుడు రూపాయిగా సుపరిచతం కావడంతో కొన్ని సూటిపోటు మాటలు తగ్గాయనిఅంటున్నారు. రూపాయి గ్రామం పేరు వింటే వైరేటిగా ఉందంటున్నారే తప్ప వివాదాలు లేవని చెబుతున్నారు. ఈ గ్రామం పక్కనే వాటర్ ఫాల్ ఉండడంతో వేర్వేరు గ్రామాల నుంచి వస్తుంటారు. ఈ పల్లె ఒక్కటే కాదు... ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చాలా పేర్లు ఇలా వింతగా ఉంటాయి. ఉద్దానంలో ప్రతి పేరు వెనక పుట్టుగా కచ్చితంగా ఉంటుంది. టెక్కలి నియోజకవర్గంలో బొమ్మాలి పేర్లతో ఊళ్లు ఉంటాయి. వికీపిడియా ప్రకారం రూపాయి ఊరు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే కాదు ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ జిల్లాలో కూడా ఉందట. ఆ ఊరి పేరు గౌర రూపాయి పీర్ అలీపూర్. ఇక్కడ 550 ఇళ్లు 3,097 మంది జనాభా ఉన్నారట.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఉమ్మడి తూర్పు టిడిపి సమావేశం

కాకినాడ,ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయింది. దీనికి ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం అయ్యారు .ఎన్నికలలో వ్యవహరించాల్సిన వ్యూహం పై చర్చించారు. ఎమ్మెల్సీ, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఈ సమావేశానికి నేతృత్వం వహించారు .వాయిస్: గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా వామపక్షాలకు చెందిన ఐ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు .అప్పుడు ఆయనకు టిడిపి మద్దతిచ్చింది. ఈసారి ఎన్నికల్లో తామే పోటీ చేస్తామని యనమల సమావేశం అనంతరం మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రతి పార్లమెంటుకు త్రీ మెన్ కమిటీని నియమిస్తున్నాము. కూటమి ఎమ్మెల్యేలు కూడా ఇందులో సభ్యులుగా ఉంటారని వెల్లడించారు.గతం లో 1.93 లక్షల గ్రాడ్యుయేట్లు నమోదయి ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెంచుతామన్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు బాధ్యతలు తీసుకుంటారని వెల్లడించారు .ఆన్లైన్ లేదా డైరెక్ట్ గా తాసిల్దార్ కార్యాలయంలో గ్రాడ్యుయేట్లు తమ దరఖాస్తులు ఇచ్చే విధంగా నాయకులు మోటివేట్ చేస్తారు అన్నారు .ఈ సమావేశానికి రాజమండ్రి పార్లమెంటు పరిధిలో కొందరు ప్రజాప్రతినిధులు మినహా మిగిలిన వారంతా హాజరయ్యారు.

# పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 10-- పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణం అపరిశుభ్రత లేకుండా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు . దీనికి పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బకెట్ల యందు వేయాలని సూచించారు . గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పరిశీలించి పరిశుభ్రత డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు . నిర్లక్ష్యంగా ఉన్న వార్డు అమెనిటి సెక్రెటరీ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే జగజ్జననీ నగర్ యందు నీటి కుంటలో వెయ్యి చాపపిల్లలను కమిషనర్ వదిలారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మురళీధర్. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వరిపంటలో సమగ్ర సస్యరక్షణకు అవగాహన



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 10- బిళ్ళలాపురం గ్రామం నందు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు గురువారం మేలైన యజమాన్య పద్ధతుల తో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఎకరానికి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోని చీడపీడల ను అరికట్టాలని సూచించారు. దానికి అనుగుణంగా పురుగు మందులు పిచికారి చేయాలన్నారు,అదే విధంగా పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 8- 10 ఏర్పాటు చేసుకోవాలని పంటలో అక్కడక్కడ పక్షి స్తావరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. వరిలో సమగ్ర పోషక యాజమాన్యం లో భాగంగా సూక్ష్మధాతు లోప నివారణకు జింకు సల్ఫేట్ రెండు గ్రాముల లీటర్ నీటికి పిచికారి చేయాలని సూచించారు. అలాగే పొలంలో నీటిని తీసివేసి ఆరబెట్టి మరుసటి రోజు నీటిని పెట్టుకోవడం వల్ల సుడిదోమ ఉధృతిని తగ్గించుకోవచ్చున్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి నీ పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం ముందు వ్యవసాయ సహాయకుడు శివ నాయక్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు .

# మాంసం విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 10-: ప్రజారోగ్యం దృష్ట్యా మాంసం విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం లోఆయనమాట్లాడుతూ వర్షాలనేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా యన్నారు. మాంసం విక్రయాల్లో శుభ్రత లేకపోతే ఇతర వ్యాధులు ప్రజలకు సంభ వించే అవకాశం ఉందన్నారు. చనిపోయిన వాటిని అమ్మడం, అపరిశుభ్ర వాతావరణంలో పనులు చేయడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మాంసం విక్రయదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. నిబంధనలప్రకారంనడుచుకోవాలని ఆయన హెచ్చరించారు.




# మంత్రిని కలిసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ యాకూబ్ భాష



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 10-రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన యాకూబ్ భాష మర్యాదపూర్వకంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసారు. గురువారం అమరావతిలోని మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండి యాకుబ్ భాష మంత్రికి పుష్ప గుచ్చాన్ని అందించి , మైనార్టీల సంక్షేమం కోసం భవిష్యత్తులో తీసుకునే చర్యలపై కార్యాచరణ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మైనార్టీల సంక్షేమం పాతాళానికి చేరిందని అన్నారు. మైనార్టీల సంక్షేమాన్ని తిరిగి గాడిలో పెట్టాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బృహత్తర ప్రణాళిక దిశగా వివిధ చర్యలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే గతంలో మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి మైనార్టీల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటినీ ప్రణాళిక బద్ధంగా అమలు చేసేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఇప్పటికే చర్యలకు శ్రీకారం చుట్టడం జరిగింద న్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు అండగా నిలిచేందుకు, ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, వ్యాపార పారిశ్రామిక రంగాలలో మైనార్టీలకు భాగస్వామ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని వీసి యాకుబ్ భాషకు మంత్రి సూచించారు. నీతిగా, నిజాయితీగా, నిస్పక్షపాతంగా మైనార్టీల సంక్షేమానికి సేవలందించాలని యాకుబ్ భాషా తో మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# రుద్ర గౌడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ఆర్సిపి పట్టణ అధికార ప్రతినిధి, జిల్లా ప్రచార ప్రధాన కార్యదర్శులు..




విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. గురువారం రోజు గుడికల్ గ్రామం నందు మాజీ రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్, వైయస్ఆర్ సీపీ వీరశైవ లింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వై రుద్ర గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన వై రుద్ర గౌడ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని వారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు ను తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్, జిల్లా ప్రచార ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్,బుట్టా యూత్ నాయకులు సయ్యద్ ఫయాజ్,వైయస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాయక్ యండి షరీఫ్,బుట్టా సోషల్ మీడియా టీం జశ్వంత్,మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవిగా దర్శనమిచ్చిన కాళికామాత



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఆళ్ళగడ్డ ప్రతినిధి :- పట్టణంలోని కాళికామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని వివిధ రకాలుగా అలంకరిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 8వ రోజైన దుర్గాష్టమిని పురస్కరించుకొని అమ్మవారిని ఆలయ అర్చలు చంద్రశేఖర్ దుర్గాదేవిగా అలంకరించారు. సందర్భంగా అమ్మవారికి బాణాల గోపాలాచారి గోవిందమ్మ దంపతులు, వీరాంజనేయులు పద్మావతి దంపతులు, దురుగడ్డ సావిత్రమ్మ కుటుంబ సభ్యులు అజయ్ కుమార్ కండికేశ్వరి ఉభయ దాతలుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి అభిషేకాలు విశేష పూజలు కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు అలాగే గతంలో లేని విధంగా ఈ సంవత్సరం నవరాత్రులలో సాయంకాలంలో ప్రముఖులతో ప్రవచనాలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్న పుల్లయ్య ఆచారి, రవికుమార్ ఆచారి, కృష్ణమాచారి, రామాచారి, భద్రయ్య ఆచారి,గోపాల్ ఆచారి, పెద్ద సుబ్బయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీ అధ్యక్షులు రవీంద్రాచారికి ఘన సన్మానం



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఆళ్ళగడ్డ మా ప్రతినిధి:- ఆళ్ళగడ్డ కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులు రవీంద్రాచారి సావిత్రమ్మ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆలయంలో ఘనంగా సన్మానించారు. కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులుగా విశేష సేవలందిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షులను దసరా నవరాత్రి ఉత్సవాలలో సన్మానించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సాంప్రదాయాన్ని పురస్కరించుకొని రవీంద్రాచారిని కమిటీ సభ్యులు దృశ్శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి రవీంద్రాచారి సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత రవీంద్రాచారి మాట్లాడుతూ అమ్మవారికి సేవచేసే భాగ్యం కల్పించిన తల్లిదండ్రులకు , కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చంద్రశేఖర్ ఆచారి,కమిటీ సభ్యులు విజయ్ కుమార్ ఆచారి వీరుడు ఆచారి రామాచారి, పెద్ద సుబ్బయ్యాచారి, గోపాలాచారి రవికుమార్ ఆచారి, చిన్న పుల్లయ్యాచారి, భద్రయ్యాచారి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన సుంకులమ్మ..



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. స్థానిక శ్రీ సుంకులమ్మ దేవాలయంలో శరన్నవరాత్రులలో భాగంగా 8వ రోజు గురువారం దురాష్టమి పురస్కరించుకొని సుంకులమ్మకు దుర్గాదేవి అలంకరణ గావించారు. భక్తులకు దుర్గాదేవి అలంకరణలో సుంకులమ్మ దర్శనం ఇచ్చారు. ప్రతి సంవత్సరం లాగానే గురువారం రోజు దేవాలయం వారిచే భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని వారి యొక్క మొక్కులను తీర్చుకున్నారు. దుర్గా దేవి అలంకరణను కార్తీక, ఉష, సుగుణ వారిచే అలంకరణ గావించారు.

## సరస్వతిదేవి అలంకరణ లో అమ్మవారు.



విభారె న్యూస్ ఎమ్మిగనూరు అక్టోబర్ 10... ఎమ్మిగనూరు పట్టణం సోగనూరు రోడ్డు లో వెలసిన శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయంలో దసరా నవరాత్రులు లో భాగంగా శ్రీ జమ్ములమ్మ దేవి అమ్మ వారు సరస్వతి దే వి అలంకరణ లో దర్శనమి చ్చింది. బుధవారం శ్రీ జమ్ములమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ధర్మకర్త తట్టే బుడ్డప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా 6 వ రోజు సరస్వతి దేవి అలంకరణ చేశారు. సాక్షాత్తు సరస్వతిదేవి దర్శనమిచ్చినట్లు కనబడింది. ప్రజలు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.కార్యక్రమలో ఆలయ కమిటీ సభ్యులు తట్టే పార్వతమ్మ, తట్టే శ్రీ విద్య, బండా నాగరత్నమ్మ, బుడిగే మణి, మాదుగుండు తులసి,మోనే సరోజ,బండా లక్ష్మి, కించగుండు జానకి,బుట్టా ప్రియ,సాహితీ,సుమిత్ర,బుట్టా నాగమ్మ పాల్గొన్నారు.

## దుర్గామాతగా దర్శనమిచ్చిన గాయత్రీ దేవి..



విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. స్థానిక గీతా నగర్లో వెలసినవేద గాయత్రి దేవాలయం నందు గాయత్రి శరన్నవరాత్రులను పురస్కరించుకొని గురువారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గామాతగా గాయత్రి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం నందు చండీ హోమ హవన కార్యాలు జరిగాయి. చండీ హోమం నవమ అధ్యాయంలో అమ్మవారికి బలకుంది నరహరి శాస్త్ర దంపతులచే ఫల సమర్పణ గావించారు.

## మూలా నక్షత్రం సందర్భంగా విద్యాభ్యాసానికి పుస్తకాలు పంపిణీకి సహకరించిన తారా రాజశేఖర్.

విభారె న్యూస్ అక్టోబర్ 10 ఎమ్మిగనూరు. దసరా దేవి శరన్నవరాత్రుల మహోత్సవం భాగంగా మూలా నక్షత్రం శుభ సందర్భంగా సరస్వతి దేవి దర్శనం ఇచ్చిన సందర్భంగా విద్యాభ్యాసానికి 1000 పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేయడానికి సహకరించిన దాత...తార ఏజెన్సీస్...ఈ కార్యక్రమానికి సహకరించిన దాతకు ఆర్యవైశ్య సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.వీరపైన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా కలిగి ఉండాలని మనసారా ఆర్యవైశ్య సంఘం వారు కోరారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190